❖•❖•❖ 9 ❖•❖•❖

# “గిన్నెలోనిది నేను త్రాగకుందునా?”

*“యేసు – ‘... తండ్రి నాకనుగ్రహించిన గిన్నెలోనిది నేను త్రాగకుందునా అని పేతురుతో అనెను’ ” (యోహాను 18:11).*

జగదుత్పత్తి మొదలుకొని అమలుచేయబడిన దేవుని ప్రణాళికకు పొందికగా (ప్రకటన 13:8), యేసు తన మరణమునకు సరిపోవు సరైన సమయమును స్థలమును ఎన్నుకొన్నాడు. ఆయన దుర్మార్గులచేత బలవంతము చేయబడలేదు లేక మతపరమైన నిరంకుశుల వెర్రితలంపుల చేత వారి వ్యూహపరచిన ప్రకారము వారి నిపుణతతో నడిపించబడలేదు. యేసు తన మరణమునకు అనుకూలపడు పరిస్థితులను, ముఖ్యముగా గెత్సేమనే తోటలో ఆయన పట్టబడు సన్నివేశమునకు సంబంధించిన పరిస్థితులను ఏర్పాటు చేయుచుండెనని లేఖనములు బయలుపర్చుచున్నవి. ఆయన పట్టబడుట పట్ల ఆయన కనుపర్చుచుండిన హావభావాలు మరియు వైఖరి, జరుగుచుండిన విషయములకు గల కారణము, ఆయనను ఎదుర్కొనిన సైనికులును ప్రధాన యాజకులును కాదు, యేసు అయియుండెనని తెలియజెప్పుచున్నవి.

*ఆయన ఆధిపత్యము యూదా చేత నడిపింపబడుచుండి సాయుధులైన సమూహమును*

*కలుసుకొనుటకు ఆయన వెళ్లుటలో ప్రతిబింబింప బడుచున్నది.* యేసు యూదాను, వానితో కూడా కుమ్మకైన రోమా సైనికులు, అధికారులు, ప్రధాన యాజకులు, పరిసయ్యులు ఆయనను పట్టుకొనుటకు వచ్చుట చూచినప్పుడు, ఆయన వారిని కలుసుకొనుటకు వెళ్ళి తనను తాను వారికి హస్తగతము చేసుకొన్నాడు. "యేసు తనకు సంభవింపబోవునవన్నియు ఎరిగినవాడై వారియొద్దకు వెళ్లి – 'మీరెవని వెదుకుచున్నారని' వారిని అడిగెను" అని యోహాను వ్రాయుచున్నాడు (యోహాను 18:4). ఆయన ప్రవర్తనను చూచి మాటలు విని జనసమూహములో నున్నవారు ఉలిక్కిపడ్డారు. అటుతరువాత, వారు మరలా ఒక చోట కూడుకొన్నప్పుడు, "బందిపోటుదొంగ మీదికి వచ్చినట్టు కత్తులతోను గుదియలతోను నన్ను పట్టుకొనవచ్చితిరా? నేను అనుదినము దేవాలయములో కూర్చుండి బోధించుచున్నప్పుడు మీరు నన్ను పట్టుకొనలేదు" అని యేసు వారితో అన్నాడు (మత్తయి 26:55). యేసు వారి మధ్యలో నుండి ఆ నాటి చీకటిలో ఎక్కడికైనా సులభముగా తప్పించుకొనగలవాడే, కానీ అది ఆయన గడియయని ఎంచుకొని దృఢనిశ్చముగల ప్రశాంతతతో ముందుకు వెళ్ళాడు.

*దీనికి తోడుగా, ఈ చారిత్రాత్మక గడియపై యేసు కలిగియుండిన అధికారము ఆయన యూదాకు స్వాగతము పలికిన విధానములో అగుపించుచున్నది.* ఆయనను అప్పగించవలసిన అవసరము యూదాకు రాకుండుటకు అనువైన ఏర్పాటును ఆయన చేశాడు. వారు వెదకుచుండిన వ్యక్తి ఆయనే అని యేసు ఆ జనసమూహముతో చెప్పిన తరువాత కూడ, ఊహింపనలవికాని కార్యము చేయుటకు యూదా ముందుకొచ్చాడు. "యూదా నీవు ముద్దుపెట్టుకొని మనుష్యకుమారుని అప్పగించుచున్నావా?" అని యేసు వాని నడిగాడు (లూకా 22:48). యేసు వ్యాఖ్యానించిన విషయాన్ని నిర్లక్ష్యము చేస్తూనే, యూదా, "బోధకుడా, నీకు శుభం!" అని చెప్పి ఆయనను ముద్దుపెట్టుకొన్నాడు (మత్తయి 26:49). యేసు – " 'చెలికాడా, నీవు చేయవచ్చినది చేయుమని' అతనితో చెప్పగా వారు దగ్గరకు వచ్చి ఆయనమీదపడి ఆయనను పట్టుకొనిరి" (మత్తయి 26:50). దీనిని బట్టి చూస్తే యూదా ఆయనను అప్పగించునట్లు యేసు వానిని అనుమతించాడని దైవికముగా వ్రాయబడిన రికార్డుల (లేఖనముల) నుండి స్పష్టమగుచున్నది. యూదా ఇంతటి విషాదకరమైన విషయమును చేయకుండునట్లు యేసు నిరోధించగలిగి యుండెను. కానీ వాడు చేయాలని ఆశించిన మరియు ఆలోచించిన పని చేయునట్లు యేసు వానికి స్వేచ్ఛ నిచ్చాడు.

*యేసు మల్కు చెవిని ముట్టి బాగు చేయుటలో ఆ సమయములో యేసుదే పైచేయి ఆయియుండిన విషయము కూడ కనబడుచున్నది.* "సీమోను పేతురునొద్ద కత్తి యుండినందున ఆతడు దానిని దూసి, ప్రధాన యాజకుని దాసుని కొట్టి అతని కుడిచెవి తెగనరికెను. ఆ దాసుని పేరు మల్కు" అని వాక్యభాగము చెప్పుచున్నది (యోహాను 18:10). దుడుకు పేతురు యేసు శిష్యులు కలిగియుండిన రెండు కత్తులలో ఒక దానిని (లూకా 22:38) బయటికి తీసి దూసాడు. బహుశ మల్కు తప్పించుకొనుటకు తన తలను క్రిందికి వంచి యుంటాడు గనుకనే వాని చెవి మాత్రమే తెగినది. యేసు వెంటనే తన శిష్యులను గద్దించుచు, "ఆపండి! ఈ మట్టుకు చాలు" అని ఆజ్ఞాపించాడు (లూకా 22:51ఎ). తరువాత ఆయన మల్కు చెవిని ముట్టి స్వస్థపరచాడు (లూకా 22:51బి). నిస్సందేహముగా, ఆయన తన జాలి చేత మల్కును బాగుచేయుట విస్ఫోటకమైన ఒక పరిస్థితి తీవ్రతను తగ్గించినది. రోమా సైనికులు మరియు ప్రధాన యాజకులు శిష్యులపైబడి దాడి చేసి యుండినట్లయితే, ఖచ్చితంగా వారిలో కొందరు

హతమార్చబడెడివారే. యేసు తన చివరి అద్భుతముతో, "అందరూ ప్రశాంతంగా ఉండండి. నన్ను పట్టుకొనుటకు వచ్చిన ఈ పార్టీతో నేను సమాధానముగా వెళ్తాను. నాకు తెలిసే నన్ను నేను వీరి చేతులకు అప్పగించుకొనుచున్నాను" అని తెలియజెప్పుచుండెను.

*ఇంతేగాక, ఆయన తన తండ్రి చిత్తమును నెరవేర్చునటకు ఈ పెను తుఫాను వంటి దౌర్జన్య పరిస్థితిలోనికి తన ఇష్టపూర్వక ఎంపిక చొప్పున ప్రవేశించుచుండెనని యేసు పేతురుతో చెప్పిన మాటలు బయలుపర్చుచున్నవి.* "కత్తి వరలో ఉంచుము; తండ్రి నాకు అనుగ్రహించిన గిన్నె లోనిది నేను త్రాగకుందునా?" అని ఆయన పేతురుతో అన్నాడు (యోహాను 18:11). యేసు, "అయితే ప్రవక్తల లేఖనములు నెరవేరునట్లు ఇదంతయు జరిగెను" అని కూడా చెప్పాడు (మత్తయి 26:56ఎ). పేతురుకిచ్చిన తన జవాబులో, ఆయన తన వాదనను శాంతికాముకత వలన చేయలేదు. కానీ ఆయన దేవుని ప్రణాళికను పూర్తిచేయుటకు గల తన దృఢసంకల్పమును ప్రకటించుచుండెను. లేఖనములను నెరవేర్చుటకును ఆయన త్రాగవలెనని తన తండ్రి యిచ్చిన గిన్నె లోనిది త్రాగుటకును ఆయన తనను పట్టుకొనుటకు వచ్చిన వారికి లొంగి పోవుచుండెను. ఆయన గడియ వచ్చినది – పోరాడుటకు కాదు, కానీ పాప పరిహారార్థమైన, నీతియుక్తమైన లొంగుబాటు చర్య ద్వారా, తనను తాను సిలువపై ఉంచుకొనుటకే. మరణించుటకు ఆయన చేయబడలేదు; ఆయనే దానిని ఏర్పరచుకొన్నాడు.

*దూతలు ఆయనకు అందుబాటులో ఉండిరని ఆయన రూఢిపర్చుట, సంభవించుచుండినదంతా ఆయన బాధ్యతలో ఉండినదనుటకు తుది నిదర్శనమై యున్నది.* "ఈ సమయమున నేను నా తండ్రిని వేడుకొనలేననియు, వేడుకొనిన యెడల ఆయన పండ్రెండు సేనా వ్యూహముల కంటె ఎక్కువమంది దూతలను ఇప్పుడే నాకు పంపడనియు నీవనుకొనుచున్నావా?" అని ఆయన పేతురును ప్రశ్నించాడు (మత్తయి 26:53). ఆయన పిలుపునివ్వాలే గాని, ఆయనకు విరోధముగా వచ్చు ఏ బలమునైననూ దైవికమైన దాసులు జయించెడివారే. యెరూషలేమునకు సమీపములో దిగియుండిన అష్షూరు రాజైన సన్హెరీబుకు సంబంధించిన 185,000 మందిని మొత్తుటకు ఒకే ఒక దూత సరిపోయాడు (యెషయా 37:36). ఈ లెక్క చొప్పున 72,000 మంది దూతలు ఏమి చేయగలిగెడివారో ఒకసారి ఆలోచించండి! ఏ కార్యము పూర్తి చేయవలెనని ఆయన దృఢముగా సంకల్పించుకొన్నాడో దానినే ఆయన చేయుచున్నాడని మన ప్రభువు చేసిన ఘోషణ వ్యక్తము చేయుచున్నది. వాటిని ఎదిరించి నిరోధించుటకు ఆయన అనుకొన్నట్లయితే ఏదియును, సమస్త దుష్ట శక్తులు సహితము, ఆయనను ఓడించలేకపోయేవే. యేసు ముందుగానే నియమింపబడిన లక్ష్యము వైపు ముందుకు వెళ్లుచుండెను. వారు దేవుని నిత్య సంకల్పమును నెరవేర్చుటకు ఆయన చేత ఉపయోగించుకొనబడుచున్నారని సైనికులకును ప్రధాన యాజకులకును ఎరుకలేదు.

ఆయన పట్టబడుచుండిన సమయములో యేసు ప్రవర్తించిన తీరు నుండి మనము ఏమి నేర్చుకొనగలము? మొదటిదిగా, ఆయన యందు విశ్వాసముంచు వారికి రక్షణను సమకూర్చుటకు ఆయనకుండిన దృఢనిశ్చయమును మరియు దైవికమైన సంకల్పమును మనము గమనించకుండా ఉండలేము. ఆయన సిలువ దిశగా అభిముఖుడయ్యాడు మరియు ఆ గడియ వైపు కఠోరముగా కదలి వెళ్లాడు.

రెండవదిగా, ఆయన తన దైవత్వము గూర్చి మనకు మరొక అద్భుతకరమైన నిదర్శనమును ఇచ్చుట గమనించగలము. పట్టబడుచుండినవాడు కేవలము ఒక మంచి వ్యక్తి

మాత్రమే కాదు; ఆయన దేవుని కుమారుడై యుండెను. మల్కు చెవి బాగు చేయబడుటయే దీనిని రుజువు చేయుచున్నది. చివరి వరకు కూడా, ఆయన శరీరధారియై యున్న దేవుడని యేసు నిదర్శనములను ప్రదర్శించుచుండెను.

మూడవదిగా, పూర్వ ప్రతికూలాభిప్రాయము మరియు దుర్మార్గము వలన కలుగు కళ్లు జిగేలుమనే కొద్దిఅడుగుల దూరములో చేయబడిన అద్భుతము అపనమ్మికయను మూకుడును దానినే పట్టుకొని వ్రేలాడదలచిన వారిలో నుండి దానిని తొలగించలేకపోయినది. ఈ స్వస్థత కార్యము తరువాత, యేసు పట్టబడుటలో మల్కు పాల్గొన్నాడా? ఆనాటి రాత్రి అంధకారముచేత గాక ఏదో మరొక దానిచేత వాని కళ్లు మూసుకపోయాయా? యేసు ప్రతి ఒక్కరిని ప్రేమిస్తున్నాడు, కానీ ఆయన మన అభీష్టమునకు వ్యతిరేకముగా మన మనస్సుల్లో గల అడ్డంకులను తొలగించడు. ఆయన కేవలము బోధిస్తాడు, నిదర్శనములను మనముందుచుతాడు, ఆహ్వానిస్తాడు, హెచ్చరిస్తాడు, మరియు మనము నిర్ణయము చేసుకొనువరకు వేచియుంటాడు.

❖◆❖◆❖

*యేసును సిలువవేయుటకు మానవుడ్ని ఏర్పాటు చేసుకొనలేదు; సిలువవేయబడుటకు యేసు ఏర్పరచుకొన్నాడు. క్రూరుల హృదయములు హస్తములు ఆకస్మికముగా ఆయనను బలముగా పట్టుకొని అదుపులోనికి తీసుకొనలేదు; ఆయన లోక రక్షణార్థమై తనను తాను అర్పించుకొనునట్లు దుర్మార్గులును అక్రమకారులునైన వారికి ఆయన లొంగిపోయాడు.*